క్లుప్తంగా

ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలి

కొత్తపల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు గణేష్ అన్నారు. మండలంలోని వాకతిప్ప, కొత్తపల్లిలో ఉన్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు ఇతర వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటనారాయణ ఉన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా పింఛన్లు

ఎంపీడీఓ ఉషారాణి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి పింఛన్లు అందేలా చర్యలు చేపట్టామని ఎంపీడీఓ జి.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అధ్యక్షతన ఆయా గ్రామాల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో ఆమె సమీక్షిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నట్టు తెలిపారు. మండలంలోని సుమారు 8608 మందికి నేరుగా వారి ఖాతాల్లో ఒకటో తేదీన జమ అవుతాయన్నారు. అనారోగ్యం, బ్యాంక్ ఖాతాలు పని చేయని సుమారు 3326 మందికి రెండో తేదీన వారి ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో ఈ ప్రక్రియను దృష్టి సారించాలన్నారు. లబ్ధిదారులు అధైర్యపడాల్సిన పని లేదని, ఈ ప్రక్రియపై గ్రామాల్లో టాంటాం ద్వారా సమాచారం అందించి నేరుగా వారి ఖాతాల్లో సొమ్ములు పంపిణీ చేస్తున్న విషయాన్ని చేరవేయాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ గ్రామ పంచాయతీలో 11 మంది వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సత్తిబాబుకు అందజేశారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి గొల్లప్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గొల్లప్రోలు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. మంగళవారం గొల్లప్రోలు పట్టణ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్ని గ్రామాల్లో ప్రచారం చేయడం సాధ్యం కాదన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు తమ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాల్లో ఉండాలని, పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్లను చైతన్యవంతుల్ని చేసి, వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా చూడాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే దమ్ము ఒక్క వైఎస్సార్ సీపీ నేతలకు మాత్రమే ఉందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి 12వ వార్డులో ప్రచారం నిర్వహించారు.

చలమలశెట్టి సునీల్‌కు మహాస్వామి ఆశీస్సులు



తపోవనం మహాస్వామి ఆశీస్సులు అందుకుంటున్న చలమలశెట్టి సునీల్

తుని రూరల్: తుని మండలం కుమ్మరిలోవలోని సచ్చిదానంద తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామిని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కలుసుకుని, ఆశీస్సులు పొందారు. మంగళవారం తపోవనం వచ్చిన సునీల్ ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సరస్వతీ మహాస్వామిని కలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యనమల కృష్ణుడు, లోవ దేవస్థానం మాజీ చైర్మన్లు పోల్నాటి శేషగిరిరావు, లాలం బాబ్జి పాల్గొన్నారు.

బడి వడిగా ప్రగతి

- మన బడి, నాడు–నేడుతో మారిన సర్కారు బడుల రూపురేఖలు
- విద్యార్థులకు ఆధునిక వసతులు
- నిర్మాణాత్మకంగా పాఠశాలల పురోగతి
- కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా డిజిటల్ విద్య
- స్వచ్ఛమైన మంచినీరు, పరిశుభ్రమైన టాయ్‌లెట్లు

పిఠాపురం నియోజకవర్గంలో	
మొత్తం పాఠశాలలు	187
నాడు–నేడు ద్వారా ఆధునీకరించినవి	149
నాడు–నేడులో ఖర్చు	రూ.77.62 కోట్లు
పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య	1,039
విద్యార్థుల సంఖ్య	సుమారు 21,500
పెరిగిన విద్యార్థుల సంఖ్య	2,500



వాకతిప్ప ఎంపీపీ పాఠశాలలో మంచినీటి సౌకర్యం



కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల డెస్కులు

కొత్తపల్లి: ఒకానొక సమయంలో సర్కారు బడులంటే కటిక నేలపై కూర్చునే పిల్లలు.. సుద్ద ముక్కలు కూడా రాయని బ్లాక్ బోర్డులు.. స్కూలుకు వస్తారో, ఎగ్గొడ్తారో తెలియని పిల్లలు.. తలుపుల్లేని టాయ్‌లెట్లు.. నాచుపట్టిన ట్యాంకుల్లోంచి మంచినీరు వస్తాయో, లేదో తెలియని కుళాయిలు.. ఇలా చెప్పుకొంటూపోతే సమస్యలు కోకొల్లలు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విద్యా విధానంలో ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులతో.. కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే రీతిలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మనబడి, నాడు–నేడు వంటి పథకాల ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పిల్లలు కూర్చునే డెస్కులు, టీచర్లు రాసే బోర్డులు, మినరల్ వాటర్, పరిశుభ్రమైన టాయ్‌లెట్లు, ఆట వస్తువులు వీటన్నింటితో పాటు విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, బెల్టులు అన్నింటినీ ప్రభుత్వమే సమకూర్చింది. ఇంగ్లిష్ అంటే ఆమడ దూరం పారిపోయే పిల్లలు.. గడగడా ఆంగ్లంతో మాట్లాడుతుంటే వారి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. వీటికితోడు వివిధ పథకాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకూ ప్రభుత్వపరంగా ఆర్థిక సహకారం అందుతోంది. ఈ నేపథ్యంలో ఐదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలు గణనీయంగా అభివృద్ధి చెందాయి.

పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా.. మన బడి, నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేశారు. ఆధునీకరణలో భాగంగా ప్రముఖ కంపెనీల వస్తువులే కొనుగోలు చేశారు. నాడు–నేడు కింద ఆధునీకరించిన పాఠశాలలను గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చేలా ఆరోగ్యకర వాతావరణంలో తీర్చిదిద్దారు. ప్రతి విద్యార్థి నేలపై కాకుండా, బెంచీలపై కూర్చునేలా డెస్కులు ఏర్పాటు చేశారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా బ్యాగులు, బూట్లు, సాక్సులు, నోటు పుస్తకాలు, బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్ బుక్స్, యూనిఫాం, బెల్ట్ ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం, జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రోజుకో మెనూ అమలు చేస్తున్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ అందజేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అత్యాధునిక మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. మినరల్ వాటర్ అందిస్తున్నారు. డిజిటల్ విద్యను చేరువ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యను బోధిస్తున్నారు. బైజూస్ కంటెంట్‌తో విద్యను అందజేసేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. స్కూలుకు వచ్చే విద్యార్థి కార్పొరేట్ స్కూల్ స్టూడెంట్‌కు ఏమాత్రం తగ్గకుండా, ఇంకా చెప్పాలంటే అంతకుమించి సౌకర్యాలు కల్పిస్తున్నారు. తల్లులు తమ పిల్లలను బడికి పంపేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు.



కొమరగిరి ఎంపీపీ పాఠశాల వద్ద ఆకట్టుకుంటున్న సింబల్



కొమరగిరి ఎంపీపీ పాఠశాలలో ఆట వస్తువులు



వాకతిప్ప ఎంపీపీ పాఠశాల



వాకతిప్ప ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కూటమి రాజకీయాలను ప్రజలు నమ్మరు



రావివారిపోడులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- వైఎస్సార్ సీపీదే విజయం..
- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఎన్నికల ప్రచారం



ముమ్మిడివారిపోడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన కూటమి కల్తీ రాజకీయాలను నమ్మే పరిస్థితుల్లో లేరని, రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. పొన్నాడ శివారు రావివారిపోడు, శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కేఎస్ఈజెడ్ పోరాట కమిటీ రైతులతో సమీక్షించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజలకిచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి, తాను మంచి చేస్తేనే ఓటు వేయండని సూటిగా అడుగుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కేఎస్ఈజెడ్ పేరుతో రైతుల నుంచి భూములు తీసుకుని, పోరాడిన రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపి కోర్టుల చుట్టూ తిప్పించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల నుంచి తీసుకున్న భూముల్లో తిరిగి సుమారు 2180 ఎకరాలను తిరిగివ్వడం హర్షణీయమన్నారు. సెజ్ నుంచి ఆరు గ్రామాలకు మినహాయింపు ఇచ్చారన్నారు. సెజ్ బాధిత రైతులకు మేలు చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. ఎంపీటీసీ జ్యోతుల వాణి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టబత్తిన సురేష్‌కుమార్, కేఎస్ఈజెడ్ వ్యతిరేక కమిటీ సభ్యులు చింతా సూర్యనారాయణ, బావిశెట్టి నారాయణమూర్తి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, తెలగంశెట్టి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



గుడివాడ, రాగంపేటల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి



వేట్లపాలెంలో ఎన్నిక ప్రచారం చేస్తున్న దవులూరి చంద్రకళ తదితరులు

- మీలో ఒక్కడిగా గెలిపించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- గుడివాడలో ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి పట్టం కట్టాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం మండలంలోని గుడివాడ, జి.రాగంపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, బుంగా శేఖర్, పార్టీ నాయకులు కనపర్తి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ బంగారు కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించి మీలో ఒక్కడిని, స్థానికుడిని, పరిచయస్తుడినైన తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన సీఎం జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి, అవి కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి బాబి, పెంటా విజయ్‌కుమార్, యినకోండ వీర విష్ణు చక్రం, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, వారా సుధాకర్ అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మీ మేలు కోరే దవులూరిని గెలిపించండి: ఆయన భార్య చంద్రకళ

సామర్లకోట: నియోజకవర్గం ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చిన తన భర్త దవులూరి దొరబాబును గెలిపించాలని ఆయన భార్య చంద్రకళ ఇంటింటా ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు గోలి బాబ్జీ, వల్లూరి వీర్రాజు చౌదరి, రాంబాబులతో కలిసి ఆమె ప్రచారం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతోనే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కు ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబుకు ఒక ఓటు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. సీఎం జగన్ పేదల కోసం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఆయనను ఓడించే ధైర్యం లేక మూడు పార్టీలతో పొత్తు పెట్టుకొని చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో జరిగిన మేలును గుర్తుంచుకుని వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, కౌన్సిలర్లు చిట్టుమాని రాఘవ, పెండ్యాల నాగవెంకటలక్ష్మీ, పాలక కుసుమ, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో..

సాయంత్రం హుస్సేన్‌పురంలో దవులూరి దొరబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కు మద్దతుగా దొరబాబు భార్య చంద్రకళ ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ మార్ని నాగమణి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అచ్చారావు, ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల కోసమే వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో



మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాల పేద ప్రజలకు అనుకూలంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మెజార్టీ సాధించేందుకు దోహదపడుతుందని చెప్పారు. స్థానిక ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మంటపంలో మంగళవారం పార్టీ మేనిఫెస్టోపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి మేనిఫెస్టో లేని, నిలకడ లేని కూటమి నాయకత్వాన్ని ప్రజలెవ్వరూ నమ్మరన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను ఎదుర్కోలేక సినీ, బుల్లితెర నటులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జెడ్పీటీసీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాల లబ్ధిని మరింత పెంచారన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు మాట్లాడుతూ ఎంతమంది మెగా కుటుంబ సభ్యులు ప్రచారానికి వచ్చినా ఎమ్మెల్యేగా గీత విజయాన్ని అడ్డుకోలేరన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, సర్పంచ్‌లు నక్కా మణికంఠ, పెనుమల్లు సుబ్బిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంగళి సుబ్బారావు, మండల బీసీ, ఎస్సీ సెల్‌ల అధ్యక్షులు గింజాల శ్రీనివాసరావు, సాకా చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లోకే పింఛన్ల సొమ్ము

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక భద్రతా పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఖాతాల్లో జమ చేసేందుకు అవకాశం లేని వారికి మాత్రం ఇళ్ల వద్దకు పంపిస్తామన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సంబంధిత అధికారులు, సిబ్బందికి మంగళవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 30,729 సామాజిక భద్రతా పింఛన్లకు 23,935 మందికి ఒకటో తేదీన నేరుగా ఖాతాలోనే జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, అత్యంత వృద్ధాప్యంలో ఉన్న మిగిలిన 6,794 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే అందిస్తామన్నారు. వీలైతే మంగళవారం సాయంత్రానికే ఇళ్ల వద్ద పింఛన్లు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జాబితాలను కూడా సచివాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఖాతాల్లో పింఛన్ సొమ్ము పడకపోతే ఆందోళన చెందవద్దని రెండో తేదీ నుంచి అటువంటి పింఛనుదారులకు కూడా ఇళ్ల వద్దకు పంపే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పింఛన్‌దారులు ఎవ్వరూ సచివాలయాలకు వెళ్లవద్దని కమిషనర్ సూచించారు. సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయడం లేదన్న విషయాన్ని పింఛన్ లబ్ధిదారులు గుర్తించాలని కమిషనర్ కోరారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కరప: మండల పరిధిలో పింఛన్ల పంపిణీకి ఇబ్బంది లేకుండా బుధవారం నుంచి అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 11,625 మంది పెన్షనర్లు ఉండగా రూ 3,41,84,000 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 8,793 మందికి బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయని, వారికి నేరుగా రూ2,63,79,000 ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మిగిలిన వారికి గ్రామ సచివాలయం సిబ్బంది ఇళ్లకు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

నీటి సమస్యకు ఫోన్ చేయండి

కాకినాడ: ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ప్రజలను సూచించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రాంతంలో అయినా నీటి సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు ఫోన్ చేయాలని కమిషనర్ సూచించారు. సత్వరమే నీటి సమస్యను పరిష్కరించడమో, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకో చర్యలు తీసుకుంటామని చెప్పారు. రూ.1.28 కోట్ల ఖర్చుతో వేసవి కార్యాచరణను సిద్ధం చేశామని, ముఖ్య ప్రాంతాలలో చలివేంద్రాలు కూడా ఏర్పాటుచేసి చల్లని నీటిని అందిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

బీజేపీ సానుభూతిపరులకు ఓటు వేయొద్దు

- మోదీ మాటలు నమ్మొద్దు
- జన చైతన్య యాత్రలో కర్నాకుల



జన చైతన్య యాత్రలో ప్రసంగిస్తున్న కర్నాకుల వీరాంజనేయులు

పెద్దాపురం: బీజేపీ సానుభూతిపరులకు ఎవరూ ఓటు వేయొద్దని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు చేపట్టిన జన చైతన్య యాత్ర మంగళవారం పెద్దాపురం పట్టణం, మండలంలోని దివిలి గ్రామాల మీదుగా సాగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక హోదా కల్పిస్తామని ఇప్పటికీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీకి మద్దతు పలికిన పార్టీలకు స్వస్తి పలకాలన్నారు. రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని తుంగలోకి తొక్కి, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కుంచే అంజిబాబు, కణితి సతీష్, గంగ, దేశెట్టి సురేష్, డాన్ శ్రీను, అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం

సామర్లకోట: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ తీరని అన్యాయం చేసిందని, రూ.లక్ష కోట్ల నిధులు ఇవ్వాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీర్రాజనేయులు డిమాండ్ చేశారు. నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రలో భాగంగా మంగళవారం సామర్లకోట వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు సంపదను దోచిపెడుతోందని, రూ.12 లక్షల కోట్ల మొండి బకాయిలను కార్పొరేట్ సంస్థలకు మాఫీ చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ గావు తీర్థం



గంగాలమ్మ తల్లి గావును దర్శించుకుంటున్న సూరిబాబు తదితరులు

శంఖవరం: జి.కొత్తపల్లిలో గంగాలమ్మ తల్లి గావు సంబరాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలను సమర్పించారు. తప్పెటగుళ్లు, సువ్వారాట వంటి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు తనయుడు సూరిబాబు, ఎంపీపీ పర్వత రాజబాబు, పర్వత జానకీదేవి, సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, గుమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.